# లోలోపల...

ఆ అమ్మాయి...అకస్మాత్తుగానే నా దృష్టిలో పడింది. దరిదాపు ఇరవై ఏళ్ళ వయసు... చామనచాయ... మనిషి ఎత్తరి... మెట్ల దగ్గర్నించి కార్ల దగ్గరికి, కార్ల దగ్గర నుంచి మెట్ల దగ్గరికి తూనీగలా కదులుతోంది. పంజాబీ డ్రస్... భుజానికి బరువుగా పెద్ద బ్యాగ్... ఆ బరువుకి ఆవేపుకి వంగి మరీ కదుల్తోంది.

ఎండవేడి... తట్టుకోలేని ఉక్క... దానికితోడు అసహనం. బ్యాంక్ ఎ.టి.యం దగ్గర నేను పదహారో వాణ్ణి. బ్యాంకుల్లో రద్దీ తగ్గి సౌకర్యంగా ఉండాలని వీటిని ఏర్పాటుచేస్తే, ఇక్కడా రద్దీ పెరుగుతోంది.

ఇందాకా నేను చూసిన అమ్మాయి అటూ ఇటూ ఎందుకు పరిగెడుతోందో నాకు అర్థం అయ్యేటప్పటికి నేను నిలబడ్డ క్యూలో కలకలం మొదలైంది. ఎ.టి.యం ఫెయిలైంది. ఓ పావుగంటలో బాగుపడుతుందని గాలి కబురు.

లైన్‌లో నేనెలాగూ చివరే ఉన్నాను కాబట్టి, నీడలోకి వచ్చి మెట్లమీద కూచున్నాను. ఎండ నుంచి పక్కకి రావటంవల్ల కొంచెం

హాయిగా ఉంది.

మళ్ళీ నా దృష్టిలో ఆ అమ్మాయి పడింది. ఎ.టి.యంలో పని పూర్తయినవాళ్ళు తమతమ కార్ల దగ్గరికి వెళ్ళగానే ఈ అమ్మాయి వాళ్ళదగ్గరికి పరిగెట్టుకు వెడుతోంది. తన చేతిలో వస్తువులు చూపించి కొనమని అడుగుతోంది. కార్ల వాళ్ళు కొంటారని ఆశేమో... అలా ఎవరూ కనపడని సమయంలో మెట్ల దగ్గర ఉన్నవాళ్ళ దగ్గరకి వస్తోంది. కారు స్టార్ట్ చేసేలోపు వాళ్ళని పట్టుకోవాలి... అందుకని అంత బరువు బ్యాగ్‌తో అటూ ఇటూ పరుగు...

క్యూలో కదలికలేదు కాబట్టి... ఆ అమ్మాయి అయోమయంగా అక్కడే ఎండలో నిలబడింది. మనిషి కొద్దిగా ఆయాసపడుతున్నట్టు కనబడుతోంది. కాసేపు నీడలోకి వచ్చి నాలాగే నీడలో కూచుంటే బావుణ్ణు.

పిల్లల్ని ఎంతో ప్రేమగా పెంచుతాం... ఎండ తగిలితే ఎక్కడ కందిపోతారో అన్నట్టు విలవిలలాడతాం. వాళ్ళ బతుకులు వాళ్ళకి వచ్చాక అంతా మామూలే... ఈ పిల్లా అంతే... ఆ అమ్మాయిని చూస్తుంటే నా సంతానం గుర్తొస్తున్నారు. నా సంతానమనే ఏమిటి? చాలామంది పరిస్థితి ఇబ్బందిగానే ఉంది. నా పరిస్థితీ అంతే... ముప్పైఏళ్ళు ఉద్యోగం చేసి రిటైర్ అయి తప్పనిసరై ఇప్పుడు వ్యాపారం... గతాన్ని తలుచుకుని ప్రయోజనం లేదు. ఇప్పటి జీవితం ఇప్పటిదే... ఎన్ని బాధలు పడుతున్నా పిల్లలకోసమే... కానీ ఆ పిల్లల మనసులో ఏముందో తెలియదు. పట్టుమని పది మాటలు మాట్లాడరు. ఖాళీలేదు వాళ్ళకి...

ఎండ మరింత పెరిగింది... క్యూ కదలకుండా అలాగే ఉంది.

సంచీ లేనివేపు చేయి ఎత్తి నుదుటిమీది చెమట తుడుచుకుంటోంది ఆ అమ్మాయి. ఇంక నా మనసు ఆగలేదు.

ఆ అమ్మాయి నావేపు చూడగానే దగ్గరికి రమ్మన్నట్టు... చేయి కదిపి పిలిచాను. కొంచెం నెమ్మదిగా అడుగులు వేసుకుంటూ వచ్చింది.

చంకలో ఉన్న బ్యాగ్‌మీద ఆన్చిన చేతిలో ఐదారు రకాల సామాన్లు ఉన్నాయి. క్యాలిక్యులేటర్, పెన్‌టార్చ్... ఓ వైపు నుంచి కనిపిస్తున్నాయి. ఆ వస్తువుల్ని అమ్మటం యాతనే... నేను చూసిన పదీపదిహేను నిముషాల్లో కొన్న వాళ్ళెవరూ లేరు.

దగ్గరికి రాగానే నా పక్కనే నీడలో చోటు చూపించి... "ఇలా కూచో"...అన్నాను. మారుమాట లేకుండానే కూచుంది.

"ముందే చెపుతున్నాను. నీ దగ్గర ఉన్న ఈ వస్తువులు కొనాలని మాత్రం నిన్ను పిలవలేదు. ఏం చెయ్యాలో తెలియనట్టు, ఎండలో నిలబడి ఆయాసపడుతున్నావు.ఓ

రెండు నిముషాలు నీడలో కూచుని సేదతీరుతావని పిలిచాను..."

అర్థంకానట్టు ముఖం పెట్టినా, అర్థం అయ్యాక చక్కగా నవ్వుతూ... 'థేంక్స్ అంకుల్..." అంది.

"నీ పేరేమిటమ్మా..." అని అడిగాను.

"రాణి... అంకుల్" అంది.

"చూడు రాణీ... కష్టపడి బతకటంలో తప్పులేదు. నీ, నా భేదం లేకుండా అందరూ కష్టపడక తప్పనిరోజులివి. కానీ... చిన్న పిల్లవి, ఇలాకాకుండా... అంటే... ఎండలో ఇలా బరువు మోస్తూ ఇంత కష్టపడటం చూస్తుంటే బాధగా ఉందమ్మా..." అన్నాను. ఇలాంటి సానుభూతి మాటలు ఈ కాలానికి, ఈ పద్ధతిలో తగవని నాకు తెలుసు.

"ఏం కష్టం అంకుల్... బరువున్న బ్యాగ్ మొయ్యటమా...? ఎండలో నిలబట్టమా...? ఇలా అలా పరిగెట్టటమా?" చాలా చిత్రంగా అడుగుతోంది రాణి.

కొంచెం నీడలో ఉండటంవల్లేమో, నీరు తగిలిన మనీ ప్లాంట్‌లా రాణి ముఖంలోకి కొంచెం తేటతనం వచ్చింది. చిత్రంగా నన్ను ప్రశ్నించిన తన ముఖంలో ప్రసన్నత, నవ్వు హాయిగా ఉన్నాయి.

"కష్టం కాదా అమ్మా... ఈ ఎండలో కాస్సేపు నిలబడితేనే చిరాగ్గా ఉంది. అందులో ఓ పక్కకి నువ్వు వంగిపోయే బరువైన బ్యాగ్‌తో... పొద్దున్న ఎప్పుడు వచ్చావో... ఏం తిన్నావో... ఎప్పటిదాకా ఇలా యాతనపడతావో..."

"రోజు పొద్దున్నే ఎనిమిదింటికి వస్తాను. రాత్రి ఏడింటిదాకా ఉంటాను. టిఫిన్ డబ్బాలో అన్నం తెచ్చుకుంటాను... మరీ అవసరం అనిపిస్తే కాఫీయో, టీయో తాగుతాను. దరిదాపు పన్నెండు గంటలూ నిలబడే ఉంటాను. అయినా ఇదేదీ బాధకాదు అంకుల్. పెద్దవారిగా మీరు చూపించిన ఎఫెక్షన్, కన్సరన్... అందుకే చెపుతున్నాను. నిజానికి ఇవేవీ బాధ కావు అంకుల్... వీటికన్నా..." అంటూ తల వంచుకుంది రాణి. మళ్ళీ ఎండదెబ్బ తటిలినట్టు ఆ పిల్ల ముఖం కళ తప్పింది.

మనం చేసే పనులు సరైనవో కావో తెలియని స్థితి చాలాసార్లు ఎదురవు తుంటుంది. ఆ అమ్మాయిని పలకరించటం, అలా ఆ విషయాలు మాట్లాట్టం ఏదీ అవసరం కాదు. అలా అని అనవసరం అనీ అనిపించదు. తన తటపటాయింపు తెలుస్తోంది.

"చెప్పమ్మా... పరవాలేదు..." అన్నాను.

"నిజానికి ఇలా చెప్పుకునే అవకాశం వస్తుందనిగానీ ఎవరికైనా చెప్పుకోగలుగుతాననికానీ అనుకోలేదు అంకుల్. రోజుకి పది గంటలు పైనే రోడ్డుమీద

ఉంటాను. నలుగురి మధ్యా అటూ ఇటూ తిరుగుతుంటాను. అందరూ నాతో మర్యాదగా ఉండాలనుకోవటం అత్యాశేనని తెలుసు. కానీ ఎక్కువమంది సరిగ్గా ఉండకపోవటమే అసలు ఇబ్బంది.

ఎ.టి.యం.లో డబ్బు తీసుకుని, కారులో కూచుని స్టార్ట్ చేసేలోపే వారికి నేను అమ్మే సరుకుల గురించి చెప్పాలి. వాళ్ళు వచ్చినపుడు డబ్బు తీసుకునే హడావిడి... కారు స్టార్ట్‌చేస్తే వెళ్ళే హడావిడి. ఈ మధ్యలో నాకు దొరికే సమయం కొద్ది నిముషాలే... అందుకే వాళ్ళ వెనకే పరిగెడతాను... కారుకి దగ్గరగా నిలబడతాను. నేను చెప్పే మాటలు సరిగా వినపడాలని కొంచెం వంగి మాట్లాడతాను. నా చేతిలో వస్తువులు చూడగానే కావాలో, అఖ్ఖర్లేదో వాళ్ళకి తెలిసిపోతుంది. నేను చెప్పింది విన్నాకైనా వాళ్ళు నిర్ణయించుకోవటానికి ఎక్కువసేపు పట్టదు. అయినా నిలబెట్టి, ఎన్నో వివరాలు అడుగుతారు. వాళ్ళ మగతనం, డబ్బున్న తనం ప్రదర్శిస్తూనే ఉంటారు. రకరకాల మాటలు, ఆఫర్లు... బేరాలు చివరికి ఏం కొనరు..."

ఆడపిల్ల కష్టపడుతోందనే ఆలోచించాను కానీ, ఈ రకం ఇబ్బందనీ, వయసులో ఉన్న ఒంటరి ఆడపిల్ల అనీ నాకు తట్టనేలేదు. రాణీ మళ్ళీ చెప్పటం ఆరంభించింది.

"ఆర్థికంగా నాకన్నా వాళ్ళ పరిస్థితి బాగుండొచ్చు... సరదాని, సౌఖ్యాన్ని పెంచి పోషించుకునే అవకాశం ఉండొచ్చు. కానీ నాలాంటి పిల్ల ఏ పరిస్థితులవల్ల రోడ్డు మీద ఇంత యాతన పడుతుందో... ఈ పిల్ల యాతనని మరింత పెంచటం అమానుషం అని వాళ్ళకి ఎందుకు అనిపించదో...అన్నదే అసలు ఇబ్బంది అంకుల్... అయినా ఓ.కె, లైఫ్ స్ట్రగుల్ తప్పదు. కనీసం ఇవాళ ఈ రకంగానేనా మీతో చెప్పుకోగలిగాను. ఇంట్లో అమ్మా నాన్నకి చెప్పుకోలేను. చెపితే... ప్రాణంగా నన్ను పెంచుకున్న నాన్న గుండెలు పగిలిపోతాయి. ఎంతో అభిమానంగా ఉండే అమ్మ విలవిలాడిపోతుంది. రోడ్డుమీద ఇలా నిలబెట్టే ఈ డబ్బు వద్దని ఇల్లు కదలనివ్వరు. జీవితమంతా కష్టపడి, ఇంక కష్టపడే ఓపిక, అవకాశంలేని వాళ్ళకి ఇదంతా చెప్పలేను. మనకి మగపిల్లలు లేరే అన్న ఫీలింగ్ వాళ్ళకి రాకూడదు. మీరు పిలిచి కూచోమన్న ఆదరణ ఎంతో హాయిగా అనిపించింది. అందుకే ఇదంతా... బరువైన బ్యాగ్ మొయ్యటం, ఎండలో నిలబడటం... ఈ ఫిజికల్ స్ట్రెయిన్ కాదు అసలు బాధ..." అంది రాణీ. ఆ పిల్లవేపే చూస్తుంటే నెమ్మదిగా నవ్వింది.

రాణీ నవ్వులో సంతోషం లేకపోవచ్చు. కానీ గొప్ప ధైర్యం ఉంది. సముద్రమంత దుఃఖం అంచులుదాటకుండా కదులుతున్న ఆ పిల్ల కన్నీటి తెరలో... ఎంత అనుభవం... ఎంత ఆలోచన... ఎంతటి పెద్దరికం... అందరు పిల్లలూ ఇలా ఉంటే ఎంత బావుంటుంది. కొద్ది నిముషాల్లో ఎంత జీవితం. ఎన్ని రకాల పరిస్థితులు కలగలుపు... ఓ ఎ.టి.ఎం.

ముందు...

నాకు మాట పెగలటంలేదు. వృద్ధుల పరిస్థితి... ఈనాటి తల్లిదండ్రుల అసహాయత... ఎంతమాత్రం భద్రత, విశ్రాంతిలేని పని, ఓపిక ఉన్నా లేకపోయినా... ఆడైనా, మగైనా వయసుతో సంబంధం లేకుండా కష్టపడటమే జీవితం అన్న కొత్త విలువలు. చాలా మందికి బాల్యం ఎలాగూ కరువైంది... ఇప్పుడు యవ్వనం కూడా కనుమరుగవుతోంది... ఇవి రెండూలేని వృద్ధాప్యం... అన్నీ సరిపెట్టుకోవటం... ఇదే ఇప్పటి జీవితం అన్న అభిప్రాయం ప్రచారం... కొద్ది సంవత్సరాలలో, కేవలం అతి తక్కువ సమయంలో, ఎన్నో దశాబ్దాలుగా సంపాదించుకున్న సౌఖ్యం, తృప్తి కూలిపోయాయి... పిల్లలకి అస్తమానం చదువు... యువతీ యువకులకి రాత్రింబగళ్ళు ఉద్యోగాలు... ఎంతటి మార్పుకి గురైన జీవితం... ఏం మాట్లాడను? అలా అని మౌనంగానూ ఉండలేను. అనవసర సలహాలు ఇవ్వకుండా మాట్లాడాలి.

"రాణీ... ఇంకేం చెప్పనక్కర్లేదమ్మా... ఇటువంటి స్థితిలోనూ నీలో నాకు ఓ విషయం బాగా నచ్చింది... పరిస్థితుల్ని, ఇబ్బందుల్ని సహ్యంగా భరిస్తున్నావు. ఒక్కమాట చెబుతాను... దానికి ముందు నాగురించి...

మీ తల్లిదండ్రుల్లాగే నాకూ ఈ వయసులో పెద్దగా పనిచేసే ఓపిక లేదు. విశ్రాంతిగా ఉండాలనే ఉంది. కానీ తప్పనిసరై చిన్న వ్యాపారం పెట్టాను. స్టేషనరీ షాప్... షాప్‌లో అమ్మకాలే కాక, బైట చిన్నాచితకా సప్లైస్ కూడా చేస్తున్నాను. మా పిల్లల చదువులు ఇంకా సాగుతున్నాయి. నాకు షాప్‌లో మనిషి సాయం కావాలి. నీ మాటల్లోనే నీ నెలసరి ఆదాయం అంచనా వేశాను. కానీ నా పరిస్థితినిబట్టి చెపుతున్నాను. ప్రస్తుతం నెలకి రెండువేలు జీతం ఇస్తాను. నీకు ఈ యాతన తగ్గుతుందని ఆశ... నీ వర్కింగ్ అవర్స్ కూడా బాగా తగ్గుతాయి... ఏమంటావు..."అన్నాను.

రాణీ పెద్దగా ఆలోచించలేదు. "థాంక్యూ అంకుల్... కానీ వొద్దు అంకుల్. ఎందుకంటే నాకు ఇది అలవాటైంది. కానీ ఓ రిక్వెస్ట్... మీరు ఇస్తానన్న పని మా అక్కయ్యకి ఇవ్వండి. అది నాలాగ ఇలా పని చెయ్యలేదు. నాకన్నా చాలా బావుంటుంది. అందువల్ల రోడ్డు మీద నాకన్నా ఇబ్బందుల ఎక్కువ. ఎంతో ఓపికమంతురాలు. మీలాంటివారి షాపైతే అక్కయ్యకి ధైర్యం. ఆ ఉద్యోగం దానికి ఇస్తే మా కుటుంబానికి ఎంతో మేలుచేసిన వారవుతారు."

రెండు నిముషాల్లో ఎంత తెలివైన నిర్ణయం. 'అక్క నాకన్నా చాలా బావుంటుంది. రోడ్డుమీదైతే నాకన్నా యాతన ఎక్కువ...' ఎంత బరువైన విషయాన్ని ఎంత సున్నితంగా చెప్పింది. రాణీ పద్ధతి, మాట తీరు నాకు తృప్తినిచ్చాయి.

"అలాగేనమ్మా... అక్కయ్యని రేపు తీసుకురా..." అన్నాను. షాప్ అడ్రస్, టైము

చెప్పాను.

ఆ తర్వాత రాణీ మరింత గలగలా కబుర్లు చెప్పింది.

"అందరు పిల్లలూ నీలా గలగలా రోజూ కొంచెంసేపు ఇంట్లో పెద్దవాళ్ళతో ఇలా హాయిగా కబుర్లుచెపితే, మా పెద్ద వయసు బాధ తగ్గుతుంది..." అన్నాను.

"పిల్లలందరికీ మాట్లాడాలనే ఉంటుంది అంకుల్. పోతే రకరకాల ఇబ్బందులు. మేం చేస్తాం అన్నవి మీకు నచ్చవని భయం... పద్ధతులు మార్పు... టైము లేకపోవటం... ఓపిక లేకపోవటం... నా విషయమే చూడండి... మీతో చెప్పుకోగలిగినట్టు, అమ్మా నాన్నతో చెప్పుకోగలిగానా?..." అంది మళ్ళీ నవ్వుతూ... రాణీతో ఈ కాస్త పరిచయం, నా పిల్లలపట్ల నాకున్న ఇబ్బందిని చాలా తగ్గించింది.

వెనక్కి తిరిగి షాప్‌కి వస్తుంటే రాణీ ముఖమే గుర్తొచ్చింది. పసివాళ్ళ ప్రతిరూపంలాంటి ముఖం... ఈనాటి పిల్లలే వేరు... వాళ్ళ జీవితమే వేరు... తల్లీ తండ్రీ... సంతానబంధం... నా చిన్నతనంలోలాగ, ఇప్పుడు అంత సింపుల్ కాదేమో... మనసులో ఉన్నదంతా చెప్పుకోగలిగే కాలం కాదిది.

పిల్లలందరికీ రాణీ అంత అవగాహన, మాటతీరు లేకపోవచ్చు... కానీ వాళ్ళందరి మనసులో ఒక్కటే... లోలోపలి ప్రేమ ఒక్కటే... తమవాళ్ళ గురించి పైకి తెలియజెప్పే భాష కొందరికి లేదు. మౌనంగా ఉంటూ, మూగగా బాధపడతారు. పిల్లలు తమకేం చెప్పటంలేదని, మొండిగా ఉంటున్నారనీ పెద్దవాళ్ళ ఆవేదన...

ఒకచోటే ఉంటూ పరస్పరం మాట్లాడుకోలేని దురదృష్టం. పసివాళ్ళు అలా ఉంటున్నారని మనం ఆదరంగా ఉండకపోతే మరింతగా ముడుచుకుపోతారు. వీళ్ళకి ఎంతో ఓపిక ఉంది. ఎంత శ్రమకైనా సిద్ధపడే గుణం ఉంది. కానీ మాట్లాడే ఓపికే లేదు... జీవితం మీద ప్రేమ ఉంది. కానీ తమవాళ్ళతో ప్రేమగా, దగ్గరగా గడిపే సమయం లేదు... పైకి మౌనం... లోలోపల అలజడి... ఇదో విచిత్రస్థితి... పెద్దవాళ్ళకిదో దురదృష్టం అనుకుంటే... పిల్లలకీ తక్కువ ఇబ్బందేం కాదు...

– ఈనాడు దినపత్రిక కథల పోటీలో బహుమతి పొందిన కథ

ఈనాడు ఆదివారం – 4-7-2004

– UNDER CURRENT (JOURNAL OF LITERATURE AND AESTHETICS - DEC.2004) (ENGLISH)